సాక్షి సూర్యాపేట

ఆదివారం । 20 । జూలై । 2025



అక్క, తమ్ముడు అదుర్స్

చిన్న వయస్సులో దేశాలు, వాటి రాజధానుల పేర్లను తక్కువ సమయంలో చెప్పి అదుర్స్ అనిపిస్తున్నారు అక్క, తమ్ముడు. - 8లో



నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్

నేరాలను నియంత్రించేందుకే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	565.00 అడుగులు
ఇన్‌ఫ్లో	:	67,800 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	1800 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	నిల్
కుడికాల్వ ద్వారా	:	నిల్
ఎడమకాల్వ ద్వారా	:	నిల్
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

బాల పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

భానుపురి (సూర్యాపేట) : వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించేందుకు నిర్వహించే ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ మహిళా, శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇచ్చే ఈ అవార్డులకు ధైర్యం, కళలు, సంస్కృతి, శాస్త్ర సాంకేతికత, క్రీడలు, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ అనే ఆరు అంశాల్లో ప్రతిభ గల విద్యార్థులు http://awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులకు ఈనెల 31వ తేదీ వరకు గడువు ఉందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిభ గల బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలు, దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు.

'నవోదయ'లో వసతులు కల్పించాలి



జవహర్ నవోదయ విద్యాలయంలో వంట సామగ్రి పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న జవహర్ నవోదయ విద్యాలయంలో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ సూచించారు. సూర్యాపేట పట్టణంలోని రెడ్డి హాస్టల్‌లో ఏర్పాటు చేసిన జవహర్ నవోదయ విద్యాలయంలో బెంచీలు, ఆర్వో ప్లాంట్, వంట గది, వంట సామగ్రి, డైనింగ్ హాల్స్, టాయిలెట్లు, లైబ్రరీ కోసం టేబుళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం నుంచి జవహర్ నవోదయ విద్యాలయం ప్రారంభమవుతుందని తెలిపారు. విద్యాలయంలో త్వరగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవరావు, డీఈఓ అశోక్, తహసీల్దార్ కృష్ణయ్య, జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్, తెలంగాణ రాష్ట్ర విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డీఈ రమేష్, ఏఈ ఓబుల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎనిమిది మంది ఎస్‌ఐల బదిలీ

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లాలో ఎనిమిది మంది ఎస్‌ఐలను ఎస్పీ కె.నరసింహ బదిలీ చేశారు. ఈమేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్(వేకెన్సీ రిజర్వు)లో ఉన్న ఎ.శివరాజ్‌ను సూర్యాపేట టౌన్ -2కు, సూర్యాపేట టౌన్- 2లో పని చేస్తున్న ఎం.ఆంజనేయులను వీఆర్‌లో ఉంచారు. వీఆర్‌లో ఉన్న సీహెచ్.గోపాల్‌రెడ్డి(ప్రొబేషనరీ ఎస్‌ఐ)ని కోదాడ రూరల్ స్టేషన్‌కు, కోదాడ రూరల్ స్టేషన్‌లో పని చేస్తున్న ఎం.అనిల్‌రెడ్డిని వీఆర్‌లో ఉంచారు. వీఆర్‌లో ఉన్న వి.సురేష్‌రెడ్డి(ప్రొబేషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్)ని చిలుకూరు పోలీస్ స్టేషన్‌కు, చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఎస్.రాంబాబును వేకెన్సీ రిజర్వులో ఉంచారు. వీఆర్ లో ఉన్న టి.అజయ్‌కుమార్(ప్రొబేషనరీ ఎస్‌ఐ)ను మోతె పోలీస్ స్టేషన్‌కు, మోతె పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న బి.యాదవేందర్‌రెడ్డిని వీఆర్‌లో ఉంచారు.

● బోనాలోత్సవం



హుజూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన బోనాలోత్సవంలో పోతురాజు వేషధారణ, బోనాలతో చిన్నారులు - హుజూర్‌నగర్

ఆర్టీఓ సురేష్‌రెడ్డికి పదోన్నతి



సురేష్‌రెడ్డి

సూర్యాపేట : సూర్యాపేట జిల్లా రవాణా అధికారి జి.సురేష్ రెడ్డికి డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు హనుమకొండకు పదోన్నతిపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు సిబ్బంది ఎంతో తోడ్పాటు నందించారన్నారు. అనంతరం ఆయనకు సిబ్బంది శాలువాలు, పూల బొకేలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్స్ జయప్రకాశ్ రెడ్డి, ఆదిత్య, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బెంజిమెన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిధులొచ్చాయ్..

- పంచాయతీలు, అంగన్‌వాడీల సొంత భవన నిర్మాణానికి రూ.6.28కోట్లు
- ఉపాధి హామీ పథకం కింద నిధులు
- స్థలాలు గుర్తించే ప్రక్రియ పూర్తి
- తీరనున్న అద్దె భారం



నాగారం : గ్రామ పంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు సమకూరనున్నాయి. ఆయా భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద నిధులు మంజూరు చేసింది. 20 పంచాయతీ భవనాలు, 19 అంగన్‌వాడీ కేంద్రాలకు కలిపి రూ. 6.28 కోట్లు విడుదల చేసింది. ఇప్పటికే స్థలాలను గుర్తించే ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పనులకు శ్రీకారం చుట్టడానికి చర్యలు తీసుకోనున్నారు.

గ్రామ పంచాయతీలు	486
అంగన్‌వాడీ కేంద్రాలు	1,209
నిధులు మంజూరైన పంచాయతీలు	20
అంగన్‌వాడీ కేంద్రాలు	19
పంచాయతీ భవన నిర్మాణ ఖర్చు:	రూ.20 లక్షలు
అంగన్ వాడీ భవనానికి	రూ.12 లక్షలు

రూ.6.28 కోటు విడుదల..

జిల్లాలోని 23 మండలాల పరిధిలో 20 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.4 కోట్లు, 19 అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు రూ. 2.28 కోట్లు మొత్తం కలిపి 32 భవనాలకు రూ.6.28 కోట్ల నిధులు ఉపాధిహామీ పథకం కింద విడుదలయ్యాయి. వీటిలో ఒక్కో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20లక్షల చొప్పున, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.12లక్షల చొప్పున నిధులు విడుదలయ్యాయి. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి ప్రత్యేక గదులు, ఒక హాల్ తోపాటు మరుగుదొడ్డి, అంగన్‌వాడీ కేంద్రానికి ఒక గది, కిచెన్, మరుగుదొడ్డి నిర్మించనున్నారు.

నేతలు చొరవ చూపాలి..

భవనాల నిర్మాణానికి అధికారులు, నేతలు చొరవ చూపితేనే పనులు ముందుకు సాగే అవకాశముంది.

త్వరలో పనులు ప్రారంభిస్తాం



పంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు ఉపాధిహామీ నుంచి నిధులు మంజూరయ్యాయి. ఆయా గ్రామాల్లో స్థలాలను సైతం గుర్తించారు. త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

- వి.వి. అప్పారావు, డీఆర్‌డీఓ

స్థలాలు గుర్తించి నిర్మాణానికి స్థానిక నాయకులు ముందుకొస్తే వెంటనే పనులు ప్రారంభించే అవకాశముందని మండల అధికారులు చెబుతున్నారు. మొదటి, రెండో విడతలో ఏర్పాటైన కొత్త పంచాయతీల్లో భవనాల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కమ్యూనిటీ గదులు, చెట్ల కింద సమావేశాలు నిర్వహించాల్సి వస్తోంది.

తీరనున్న అద్దె భారం..

జిల్లాలో 486 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 306 పంచాయతీలకు పక్కా భవనాలు ఉన్నాయి. మిగతా 180 అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. పంచాయతీలకు గ్రామీణ ప్రాంతాల్లో అద్దె నెలకు రూ.18వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.25వేల చొప్పున చెల్లిస్తున్నారు. అలాగే జిల్లాలో 1,209 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో కేవలం 306 అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే సొంతభవనాలున్నాయి. 452 కేంద్రాలు అద్దె భవనాల్లో, 451 ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రతినెలా గ్రామాల్లో రూ.1,000, పట్టణ ప్రాంతాల్లో రూ.2వేలకు పైగా అద్దె చెల్లించడం ప్రభుత్వానికి భారంగా మారింది. త్వరలో 19 భవనాలు నిర్మించనుండడంతో అద్దె భారం తగ్గనుంది.



'ఉన్నతాధికారిగా ఉంటే ప్రజలకు ఎంతో సేవ చేసే అవకాశం ఉంటుందన్న ఆలోచన నాకు చదువుకుంటున్న రోజుల్లోనే కలిగింది. మా స్కూల్‌కు ఒకసారి కలెక్టర్ వచ్చారు. ఆయన అక్కడి సమస్యలను చూసి అక్కడికక్కడే పరిష్కరించారు. సమాజంలో ఒక ప్రత్యేకత కలిగిన అధికారిగా సేవ చేయాలంటే సివిల్ సర్వెంట్ కావాలని నిర్ణయించుకున్నా.. లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాను' అని చెప్పారు యువ ఐపీఎస్ అధికారి అక్షాంశ్‌యాదవ్. భువనగిరి డీసీపీగా పనిచేస్తున్న ఆయన.. సివిల్స్ వైపు రావడానికి స్ఫూర్తినిచ్చిన అంశాలు, ఉద్యోగ జీవితం అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

-సాక్షి, యాదాద్రి

శ్రమిస్తే.. విజయం సొంతం

- పాఠశాల స్థాయి నుంచే సివిల్స్‌పై ఆసక్తి పెంచుకున్న
- ఉన్నతాధికారిగా సేవలందించాలనే తపన
- స్వతహాగానే సివిల్స్‌కు ప్రిపరేషన్
- యువత ఉన్నత ఆశయాలు కలిగి ఉండాలి
- భూవివాదాల్లో పోలీసుల జోక్యం సహించను
- డ్రగ్స్ నివారణకు అవగాహన సదస్సులు

భువనగిరి డీసీపీ అక్షాంశ్‌యాదవ్

Sunday INNER VIEW

మాది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రా. మా నాన్న అజాబ్‌సింగ్ యాదవ్. ఆగ్రా యూనివర్సిటీలో జాగ్రఫీ ప్రొఫెసర్. అమ్మ గృహిణి. చిన్నప్పటి నుంచే ఉన్నత చదువులపై నాకు ఆసక్తి పెరిగింది. సివిల్ సర్వీస్ పరీక్ష రాయాలని పాఠశాల స్థాయి నుంచే ఆలోచన ఉంది. నాకు ఓ సోదరుడు, సోదరి ఉన్నారు. వారు వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇటీవలే నాకు వివాహమైంది. నా భార్య రోష్నీ స్వస్థలం ఢిల్లీ. ఆమె రిపబ్లిక్ టీవీలో ఉద్యోగం చేస్తున్నారు.

గ్రేహౌండ్స్‌లో మొదటి పోస్టింగ్

ఐపీఎస్ శిక్షణ పూర్తయిన తర్వాత నన్ను తెలంగాణ క్యాడర్‌కు కేటాయించారు. ఆదిలాబాద్‌లో ట్రైనీ అధికారిగా కొన్ని రోజులు పనిచేశాను. భద్రాచలంలో గ్రేహౌండ్స్ ఏఎస్పీగా తొలిసారిగా విధుల్లో చేరాను. అక్కడ ఏడాది పని చేసిన తర్వాత అప్పటి గవర్నర్ తమిళిసై వద్ద ఏడీసీగా పనిచేశాను. పది నెలల తర్వాత హైదరాబాద్ సిటీ సెంట్రల్ జోన్ డీసీపీగా పనిచేశాను. నేను అక్కడ పనిచేస్తున్న సమయంలోనే సినీ హీరో అల్లు అర్జున్ సంధ్య థియేటర్ సందర్శన, తొక్కిసలాట ఘటన జరిగింది. ఈ సంవత్సరం మార్చిలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని భువనగిరి జోన్ డీసీపీగా వచ్చాను.

కోచింగ్‌కు వెళ్లకుండానే..

ఢిల్లీ యూనివర్సిటీలో బీఏ ఆనర్స్ చదివాను. 2015లో డిగ్రీ పూర్తి కాగానే జాగ్రఫీలో పీజీ చేస్తూనే సివిల్స్‌కు సన్నద్ధమయ్యాను. కోచింగ్‌కు వెళ్లకుండానే స్వతహాగానే ప్రిపేర్ అయ్యాను. పబ్లిక్ సర్వీస్ కమిషన్ రూపొందించిన బుక్స్ చదివి నోట్స్ తయారు చేసుకున్నా. పుస్తక పఠనం సివిల్స్ సాధించడానికి నాకు ఎంతగానో తోడ్పడింది. జాగ్రఫీతో పాటు సివిల్స్‌కు అవసరమయ్యే పుస్తకాలు చదివాను. తొలి ప్రయత్నంలో 2017లో ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. కానీ, సక్సెస్ కాలేకపోయాను. రెండవసారి ప్రయత్నం చేశాను. 2019లో సివిల్స్ సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యాను.



ఇక్కడి ప్రజలు సహృదయులు

ప్రజలు తమ సమస్యలను పోలీస్ శాఖ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తాను. ఇక్కడి ప్రజలు సహృదయులు. అన్ని విధాలా పోలీస్ శాఖకు సహకరిస్తారు. పోలీస్ స్టేషన్‌లలో ల్యాండ్ సెటిల్‌మెంట్‌లపై నిఘా పెట్టాం. సివిల్ మ్యాటర్‌లో జోక్యం చేసుకోవద్దని పోలీసులకు ఆదేశాలిచ్చాం. జాతీయ రహదారిపై పెట్రోలింగ్ ముమ్మరం చేశాం. రోడ్డు యాక్సిడెంట్లను నిరోధించడం, డ్రగ్స్ నివారణకు అవగాహన చర్యలు చేపట్టడం, కార్డన్ సెర్చ్, నాకాబంది నిర్వహిస్తున్నాం. మహిళలపై జరుగుతున్న దాడుల కేసులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. సీసీ కెమెరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, జీరో ఎఫ్ఐఆర్ కేసుల నమోదుకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

యూత్ గోల్ ఇదే..

యువత లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ లక్ష్యాలను చేరుకునేందుకు నిరంతరం శ్రమిస్తే తప్పక విజయం లభిస్తుంది. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి. సమాజంలో ఉత్తమ సిటిజన్‌గా ఎదగాలి. ఆడపిల్లలను గౌరవించాలి. మెరుగైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి.



కార్డన్‌సెర్చ్ లో ప్రజలకు సూచనలు ఇస్తున్న డీసీపీ అక్షాంశ్ యాదవ్

కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా గోదావరి జలాలు ఇవ్వాలి

- మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



మూసీ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : బతుకు పోరాటం చేస్తున్న రైతులపై యుద్ధం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి రైతాంగానికి క్షమాపణ చెప్పి కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా గోదావరి జలాలు అందించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేట మండల పరిధిలోని మూసీ ప్రాజెక్టు నుంచి ఎడమ కాలువ ద్వారా సాగు నీటిని విడుదల చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. మార్పు పేరుతో అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ కాలంలోనే ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి తెచ్చుకుందన్నారు. రైతాంగానికి నీళ్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు లేదన్నారు. వారిద్దరికీ నీటి పారుదల రంగంపై పరిజ్ఞానం లేదన్నారు. ఉత్త మాటలో చెత్త మాటలో చెప్పడం లేదని, తన మాటలు అబద్ధమని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని సవాల్ విసిరారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేసిన తప్పును ఒప్పుకొని కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా నీరు అందించాలన్నారు. దీంతో మిడ్ మానేరు, మల్లన్న సాగర్ ద్వారా బస్వాపూర్, గంధమల్ల, ఎస్సారెస్పీ ద్వారా ఉమ్మడి నిజామాబాద్, మెదక్, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు సమృద్ధిగా నీరు అందుతదన్నారు. కన్నెపల్లిలో బటన్ నొక్కితో నాలుగు రోజుల్లో పెన్‌పహాడ్ మండలం రావి చెరువుకు నీళ్లు అందే అవకాశం ఉందన్నారు. చంద్రబాబుకు బనకచర్ల అనుమతులు రావడం కోసమే కాళేశ్వరాన్ని ఎండబెడుతున్నారని ఆరోపించారు. మూసీ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన సోలిపేట, రత్నపురం, రామారం, యర్కారం గ్రామాల్లో కూడా సైతం గోదావరి జలాలతోనే పంటలు పండాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మిచెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, పంచామృతాభిషేకం నిర్వహించారు. నూతన పట్టు వస్త్రాలంకరణ చేసి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం విష్వక్సేనారాధన , పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, నవీన్ కుమార్, అర్చకులు రామాచార్యులు ,పద్మనాభా చార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయా చార్యులు పాల్గొన్నారు.



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

సౌర.. నారీశక్తి

స్వయం సహాయక సంఘాల మహిళల ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు

- కట్టంగూర్ మండలం అయిటిపాములలో రూ.50 లక్షలతో ఏర్పాటు
- పైసా ఖర్చు లేకుండా ప్రతినెలా రూ.2 వేలు పొందుతున్న మహిళలు
- బ్యాటరీలు అద్దెకిచ్చి ఆదాయం పొందుతున్న స్వబాగ్ ల్యాబ్స్ సంస్థ



అయిటిపాములలో ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్‌ను శుభ్రపరుస్తున్న మహిళ

సోలార్ ప్యానెల్‌తో విద్యుత్‌ను స్టోరేజీ చేసి స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు నెలకు రూ.రెండు వేల ఆదాయం పొందుతున్నారు. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామంలో స్వబాగ్ ల్యాబ్స్ సంస్థ.. కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సహకారంతో మహిళా స్వయం సహాయక సంఘాలకు చెందిన 50 మందిని ఎంపిక చేసి వారి ఇళ్లపై స్వచ్ఛశక్తి ఆఫ్‌గ్రిడ్ సోలార్ సిస్టమ్‌తో చార్జింగ్ బ్యాటరీ యూనిట్లు ఏర్పాటు చేసింది. ఈ సోలార్ ప్యానెల్స్‌తో మహిళలు లబ్ధి పొందుతున్నారు.

కట్టంగూర్ : పేద మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని స్వబాగ్ ల్యాబ్స్‌కు కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.50 లక్షలు మంజూరు చేశారు. ఈ డబ్బులతో స్వబాగ్ ల్యాబ్స్ వారు స్వచ్ఛశక్తి కేంద్రం, మహిళా సంఘాలతో రెండు సంవత్సరాల పాటు అగ్రిమెంట్ చేసుకొని అర్హులైన 50 మంది మహిళల ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. మహిళలు వారంలో ఒకటి లేదా రెండుమార్లు సోలార్ ప్యానల్స్‌ను శుభ్రపరిచి ఆదాయం పొందుతున్నారు. నాలుగు నెలలుగా ప్రతి మహిళ బ్యాంక్ అకౌంట్‌లో ఒకటో తేదీన సంస్థ వారు రూ.2 వేలు జమ చేస్తున్నారు. మహిళలు సోలార్ ప్లేట్ల క్లీనింగ్, సిబ్బందికి సహకరిస్తే సరిపోతుంది.

ఎలక్ట్రిక్ వాహనాల విక్రయం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు

గ్రామంలోని స్వచ్ఛ శక్తి కేంద్రం వద్ద స్వబాగ్ ల్యాబ్ సంస్థ ఎలక్ట్రిక్ వాహనాలు సైతం విక్రయిస్తోంది. ఇప్పటి వరకు 4 ఎలక్ట్రిక్ వాహనాలను అమ్మారు. ఎలక్ట్రిక్ వాహనం ఒక్కసారి చార్జింగ్ ద్విచక్ర వాహనం 80 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. ఇక్కడి ఒక్కో సోలార్ ప్యానల్‌తో రోజుకు రెండు నుంచి మూడు బ్యాటరీలు రీచార్జ్ అవుతాయి. స్వబాగ్ ల్యాబ్స్ సంస్థ బ్యాటరీని రూ.80 చొప్పున వాహనదారులకు అద్దెకు ఇచ్చి ఆదాయాన్ని పొందుతోంది. ప్రస్తుతం రోజుకు 15 బ్యాటరీలను అద్దెకిస్తోంది.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎలక్ట్రిక్ ఆటోలు

సోలార్ ప్యానెల్‌తో నేరుగా చార్జింగ్

ఇంటిపై ఏర్పాటుచేసిన రెండు సోలార్ ప్యానల్స్‌తో నేరుగా బ్యాటరీ రీచార్జ్ అవుతుంది. ఒక్కో బ్యాటరీ చార్జ్ కావడానికి కనీసం మూడు గంటల సమయం పడుతుంది. బ్యాటరీ 100 శాతం చార్జ్ అవగానే ఆటోమెటిక్‌గా చార్జింగ్ ఆగిపోతుంది. స్వబాగ్ ల్యాబ్ వారు ఐఓటీ ద్వారా బ్యాటరీ చార్జింగ్‌ను తెలుసుకుని వెంటనే అక్కడికి వెళ్లి మరో బ్యాటరీ అమర్చి చార్జింగ్ అయిన బ్యాటరీని స్వచ్ఛశక్తి కేంద్రం వద్దకు తరలిస్తారు. ఒక్కో బ్యాటరీ రెండు యూనిట్లు విద్యుత్‌ను స్టోరేజీ చేసుకుంటుంది. స్వబాగ్ ల్యాబ్ వారు యూనిట్‌కు రూ.16.50 చొప్పున మహిళలకు చెల్లిస్తున్నారు.



సోలార్ ప్యానెల్‌తో చార్జ్ అవుతున్న బ్యాటరీ

నెలకు రూ.2 వేలు ఆదాయం వస్తోంది



ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సహకారంతో మా ఇంట్లో ఏర్పాటు చేసిన సోలార్ ఆఫ్‌గ్రిడ్ కోఆపరేటివ్ సిస్టమ్‌తో నెలకు రూ.2 వేలు ఆదాయం వస్తోంది. నాలుగు నెలలుగా రూ.6 వేల ఆదాయం వచ్చింది. సోలార్ ప్లేట్‌ల క్లీనింగ్, సిబ్బందికి సహకరించడం తప్ప ఎలాంటి రిస్క్ లేదు. సోలార్ ప్యానల్‌కు కోతుల బెడద లేకుండా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

-ముక్కెర అనిత, అయిటిపాముల

మధ్య తరగతి కుటుంబాలకు పెద్ద సాయం



ప్రభుత్వ ద్వారా అయితే యూనిట్‌కు రూ.3 నుంచి రూ.4 వరకు ఆదాయం లభిస్తుంది. స్వబాగ్ ల్యాబ్ వారు యూనిట్‌కు రూ.16.50 చెల్లిస్తున్నారు. అదనంగా సోలార్ ప్యానల్ యూనిట్ల సంఖ్య పెంచుకుంటే మహిళలు ఎక్కువ మొత్తంలో ఆదాయం పొందేందుకు అవకాశం ఉంది. మధ్య తరగతి కుటుంబాలకు ఇది చాలా పెద్ద సహాయం.

- చెవుగోని సైదమ్మ, ఎఫ్‌పీఓ చైర్మన్, అయిటిపాముల

సోలార్ ప్యానెల్‌తో డైరెక్ట్‌గా బ్యాటరీ చార్జింగ్



సోలార్ విద్యుత్ బ్యాటరీ దేశంలోనే ఇది మొదటి పైలెట్ ప్రాజెక్ట్. సూర్యశక్తిని వినియోగించుకుని ఆదాయం సంపాదించుకునేందుకు ఇది మంచి అవకాశం. ఎలక్ట్రిక్ వాహనాలకు విద్యుత్‌కు బదులుగా ఈ బ్యాటరీలను ఉపయోగించుకోవచ్చు. పర్యావరణ పరిరక్షణకు, వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. భవిష్యత్‌లో మరిన్ని స్వచ్ఛ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మేమే బ్యాటరీలను కొనుగోలు చేసి ప్రతి మహిళకు నెలకు రూ.2 వేలను ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నాం.

- జి. సుధాకర్‌బాబు, సీఈఓ, స్వబాగ్ ల్యాబ్స్

క్లుప్తంగా

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


లింగయ్య (ఫైల్)

పాలకవీడు: పాలకవీడు మండలంలోని కోమటికుంట గ్రామ చెరువులో రెండు రోజుల క్రితం చేపల వేటకు వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం తెల్లవారు జామున లభ్యమైంది. ఎస్‌ఐ ఆర్. కోటేషం తెలిపిన వివరాల ప్రకారం.. కోమటికుంట గ్రామానికి చెందిన రాతికింది చినలింగయ్య(51) గురువారం సాయంత్రం గ్రామ పరిధిలోని చెరువులోకి చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. లింగయ్య జాడ కోసం రెండు రోజులుగా స్థానిక మత్స్యకారులు, రెస్క్యూ టీం గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు శనివారం తెల్లవారుజామున మృతదేహం చెరువు ఒడ్డుకు కొట్టుకురాగా పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య కామేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో హుండీ చోరీ

మునగాల: మునగాల మండల కేంద్రం శివారులో గల పెద్దమ్మతల్లి దేవాలయంలో శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు హుండీని చోరీ చేశారు. అమ్మవారి ముక్కుపుడక కూడా ఎత్తుకెళ్లినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ పిట్టల శ్రీనివాస్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

గంజాయి సేవిస్తున్న నలుగురి అరెస్ట్

తిప్పర్తి: గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను తిప్పర్తి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. శనివారం ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశరాజుపల్లిలోని ఓ ఇంట్లో శుక్రవారం కొందరు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నారని పక్కా సమాచారం అందడంతో తిప్పర్తి పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులతో పాటు ఓ బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వారికి గంజాయి టెస్ట్ నిర్వహించగా పాజిటివ్ వచ్చిందని ఎస్‌ఐ పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో చింత నాగరాజు, పిట్టల శివ, బొజ్జ సహదేవ్, బాలుడు ఉన్నారు. వారిని కోర్టు ఆదేశాల మేరకు డీఅడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిందితులను పట్టుకున్న ఎస్‌ఐ శంకర్, పోలీస్ సిబ్బందిని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.

నెమ్మికల్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సస్పెన్షన్

సూర్యాపేటటౌన్: ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. శ్రీహరిని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె. అశోక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ డి. సుకన్యను హెచ్‌ఎం శ్రీహరి వేధించినట్లు ఆరోపణలు రావడంతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

అక్క, తమ్ముడు అదుర్స్

- తక్కువ సమయంలో ప్రపంచ దేశాలు, వాటి రాజధానుల పేర్లు చెప్పడంలో దిట్ట
- ఇండియన్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకున్న ఆకృతి, తారక్ నంద

ఐదో తరగతి, ఒకటో తరగతి చదివే చిన్నారులు స్కూల్ నుంచి వచ్చిన తర్వాత ఆటలు ఆడుతూ సరదాగా గడుపుతుంటారు. కానీ ఈ అక్క, తమ్ముడు ప్రపంచ దేశాలు, వాటి రాజధానుల పేర్లు నిమిషాల వ్యవధిలో చెబుతూ రికార్డులు సృష్టిస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నిరంతర సాధనతో మిగతా పిల్లల కంటే ప్రత్యేకంగా తమను తీర్చిదిద్దుకున్నారు.

టాలెంట్



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌తో ఆకృతి (ఫైల్)


ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌తో తారక్ నంద

భువనగిరి: చిన్న వయస్సులో ప్రపంచ దేశాలు వాటి రాజధానుల పేర్లను తక్కువ సమయంలో చెప్పి అదుర్స్ అనిపిస్తున్నారు అక్క, తమ్ముడు. భువనగిరి పట్టణంలోని శ్రీ ఆర్‌కే ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ ఆశ్లేష దంపతులకు కుమార్తె ఆకృతి, కుమారుడు తారక్ నంద సంతానం. ఆకృతి ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతుండగా.. తారక్ నంద భువనగిరి పట్టణంలోని హ్యాపీ మెడల్స్ పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. ఆకృతి 3వ తరగతిలో ఉన్నప్పుడే తల్లిదండ్రులు ప్రపంచ దేశాలు వాటి రాజధానుల పేర్లను ఆమెకు నేర్పించడం ప్రారంభించారు. అయితే తక్కువ సమయంలో చెప్పడం దేశాలు, వాటి రాజధానుల పేర్లు చెబితే ఎలా ఉంటుందనే ఆలోచన ఆకృతికి వచ్చింది. ఈ ఆలోచననే తండ్రి రాజ్‌కుమార్‌తో పంచుకుంది. దీంతో రాజ్‌కుమార్ కుమార్తె ఆకృతిని ప్రోత్సహిస్తూ రాత్రి సమయంలో ప్రపంచ దేశాలు, వాటి రాజధానుల పేర్లను పూర్తిగా నేర్పించి తక్కువ సమయంలో వాటిని చెప్పడం ప్రాక్టీస్ చేయించాడు. సుమారు నెల రోజుల పాటు ప్రాక్టీస్ చేసి 194 దేశాలు వాటి పేర్లను ఆకృతి 10 నిమిషాల్లో చెప్పడం ప్రారంభించింది. అనంతరం 2023 జూన్ 7న నిర్వహించిన పోటీల్లో 194 దేశాలు, వాటి రాజధానుల పేర్లను ఆకృతి 4 నిమిషాల 35 సెకండ్లలో చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది.

అక్కను ఆదర్శంగా తీసుకుని..

అక్క ఆకృతిని ఆదర్శంగా తీసుకుని ఆమె సోదరుడు తారక్ నంద తాను కూడా దేశాలు వాటి రాజధానుల పేర్లను నేర్చుకుని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకోవాలని భావించాడు. అతడిని ప్రోత్సహించేందుకు గాను.. అక్క లాగా నేర్చుకుని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకుంటే సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్తామని తల్లిదండ్రులు చెప్పడంతో తారక్ నంద పట్టుదలతో వాటిని నేర్చుకోవడం ప్రారంభించాడు. 2024 వేసవి సెలవుల్లో తారక్ నంద ప్రతిరోజు సుమారు 6 గంటల పాటు కష్టపడి దేశాలు వాటి రాజధానుల పేర్లను నేర్చుకోవడంతో పాటు తక్కువ సమయంలో చెప్పడం ప్రాక్టీస్ చేశాడు. రాత్రి సమయంలో విధులను ముగించుకుని వచ్చిన తర్వాత తండ్రి రాజ్‌కుమార్ కుమారుడికి కొంత సమయాన్ని కేటాయించి ప్రాక్టీస్ చేయించడం అతనికి ఎంతో ఉపయోగంగా మారింది. ఇదే సమయంలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన పోటీల్లో తారక్ నంద 100 దేశాలు వాటి రాజధానులను ఒక నిమిషం 53 సెకండ్లలో చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరును నమోదు చేసుకున్నాడు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో తారక్ నందకు నిర్వాహకులు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోనూ పేరు నమోదు చేసుకోవాలనే తపన తారక్ నందలో పెరిగింది. దీంతో మరింత ప్రాక్టీస్ చేయడం ప్రారంభించాడు. 2025 మార్చిలో ఆన్‌లైన్ ద్వారా జరిగిన పోటీల్లో తారక్ నంద పాల్గొని 196 దేశాలు వాటి రాజధానుల పేర్లను కేవలం 4 నిమిషాల 20 సెకండ్లలో చెప్పి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. ఇటీవల తారక్ నందను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావుతో పాటు భువనగిరి డీసీపీ అక్షాంశ్ యాదవ్ సైతం అభినందించారు.

కేజీబీవీ వాచ్‌ఉమెన్ ఆత్మహత్యాయత్నం

- ఎస్‌ఓ ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపణ


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అడవిదేవులపల్లి కేజీబీవీ వాచ్‌ఉమెన్ అరుణ

అడవిదేవులపల్లి: ఐదు నిమిషాలు ఆలస్యంగా పాఠశాలకు వచ్చినందుకు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్(ఎస్‌ఓ) మందలించిందని మనస్తాపానికి గురైన వాచ్‌ఉమెన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన మంగళవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలో జరిగింది. వివరాలు.. అడవిదేవులపల్లి మండలం ఉల్సాయిపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు కేతావత్ అరుణ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 9ఏళ్లుగా వాచ్‌ఉమెన్‌గా పనిచేస్తోంది. శనివారం అరుణ ఐదు నిమిషాలు పాఠశాలకు ఆలస్యంగా రాగా.. ఎస్‌ఓ నాగలక్ష్మి ఆలస్యంగా రావడానికి కారణమేమిటని అరుణను అడిగింది. తాను ఐదు నిమిషాలే ఆలస్యంగా వచ్చానని, అందుకు నిలదీస్తావా అని అరుణ అనడంతో వారిద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన అరుణ పక్కనే ఉన్న విద్యుత్ వైరును పట్టుకునే ప్రయత్నం చేయగా సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఆమెను తీసుకొచ్చి బల్లపై కూర్చోబెట్టారు. కొంతసేపటి తర్వాత దగ్గరలో ఉన్న విద్యార్థిని చున్నీని అరుణ లాక్కొని మెడ చుట్టూ చుట్టుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. తోటి సిబ్బంది వెంటనే ఆమెను మండల కేంద్రంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. తనను సూటిపోటి మాటలు అంటూ వేధింపులకు గురిచేస్తోందని, మెమో ఇస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతుందని బాధితురాలు అరుణ కన్నీటి పర్యంతమైంది. అంతేకాకుండా ఎస్‌ఓ నాగలక్ష్మితో తాము కూడా విసిగిపోతున్నామని తోటి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలను ఎవరైనా ఉన్నతాధికారులు సందర్శించేందుకు వచ్చినప్పుడు తమపై ఎస్‌ఓ తప్పుడు సమాచారం ఇస్తూ ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. బాధితురాలు అరుణ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఓపై ఫిర్యాదు చేసింది.

నిబంధనల మేరకు వ్యవహరించాను..

ఈ ఘటనపై ఎస్‌ఓ నాగలక్ష్మి మాట్లాడుతూ.. తాను నిబంధనల మేరకు మాత్రమే వ్యవహరించానని, మెనూ అమలు విషయంపై ఇప్పటికే ఉన్నతాధికారులకు పాఠశాలపై ఫిర్యాదులు అందాయని, ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా సమయపాలన పాటించాలని, విద్యాలయంను శుభ్రంగా ఉంచుకుందామని చెప్పానని.. దీంతో కొంతమంది సిబ్బంది తాను అనని మాటలు అన్నట్లుగా చెబుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

విద్యాలయంను సందర్శించిన అధికారులు..

ఈ ఘటనపై సమాచారం అందుకున్న తహసీల్దార్ రాగ్యానాయక్, ఎంఈఓ వరలక్ష్మి పాఠశాలను సందర్శించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి నివేదిక ఉన్నతాధికారులకు అందిస్తామని పేర్కొన్నారు.

గ్రిల్స్‌లో ఇరుక్కుపోయిన మహిళ కాలు


కాలు ఇరుక్కుపోవడంతో రోదిస్తున్న యాదమ్మ

రామన్నపేట: రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన ఓ మహిళ కాలు ఆస్పత్రి గేటు ముందున్న క్యాటిల్ గార్డ్(గ్రిల్స్)లో ఇరుక్కుపోయింది. వివరాలు.. రామన్నపేటకు చెందిన యాదమ్మ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో తన బంధువులకు శనివారం భోజనం తీసుకొని వెళ్తుండగా.. ఆమె కాలు ఆస్పత్రి గేటు ముందు ఉన్న గ్రిల్స్‌లో ఇరుక్కుపోయింది. ఆస్పత్రి సిబ్బంది గమనించి గ్రిల్స్ పైపును కట్ చేసి యాదమ్మ కాలును బయటకు తీశారు.

కుక్క కాటుకు గురై వ్యక్తి మృతి

మేళ్లచెరువు: కుక్క కాటుకు గురైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. వివరాలు.. మేళ్లచెరువు మండలం కందిబండ గ్రామానికి చెందిన డెక్కం మధు(39) ఇంటి ఎదుట 20 రోజుల క్రితం చిన్న కుక్కపిల్లను వేరే కుక్కలు కరుస్తుండగా.. అతడు కుక్కపిల్లను కాపాడబోయే క్రమంలో కుక్కపిల్ల అతడి చేతిని కొరికింది. అతడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రేబిస్ వ్యాక్సిన్ వేయించుకున్నాడు. మూడు వారాల తర్వాత అతడికి రేబిస్ వ్యాధి తీవ్రత ఎక్కువకావడంతో కుటుంబ సభ్యులు నాలుగురోజుల క్రితం హైదరాబాద్‌లోని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రూ.50కోట్ల వ్యవసాయ రుణాలు ఇస్తాం

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : ఈ వానాకాలం సీజన్‌లో రైతులకు రూ.50 కోట్ల వ్యవసాయ రుణాలు ఇవ్వాలని నిర్ణయించామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం డీసీసీబీలో ఏర్పాటు చేసిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా రూ.3500 కోట్ల టర్నోవర్ చేరుకోవడమే లక్ష్యంగా పని చేయాలని ఉద్యోగులకు సూచించారు. రైతులకు దీర్ఘకాలిక రుణాలు త్వరగా ఇవ్వాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, సభ్యులు గొంగిడి మహేందర్‌రెడ్డి, గుడిపాటి సైదులు, పాశం సంపత్‌రెడ్డి, దనావత్ జయరాం, కోడి సుష్మ, కె.లింగంయాదవ్, పల్లా ప్రవీణ్‌రెడ్డి, రంగాచారి, అంజయ్య, శ్రీనివాస్, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో శాంతిభద్రతలు గాడి తప్పాయి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

నల్లగొండ: నకిరేకల్ నియోజకవర్గంలో శాంతిభద్రతలు గాడి తప్పాయని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శనివారం నల్లగొండ ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ను చిరుమర్తి లింగయ్య కలిసి బీఆర్‌ఎస్ నాయకులపై జరుగుతున్న దాడులను అడ్డుకోవాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులను టార్గెట్ చేసి కాంగ్రెస్ గుండాలు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. నకిరేకల్ మండలం తాటికల్ గ్రామంలో గతంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌గా పనిచేసిన వ్యక్తికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం పట్ల బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కార్యకర్త మనోహర్‌రెడ్డి సోషల్ మీడియాలో ప్రశ్నించిందుకు గాను అతడిపై మాజీ సర్పంచ్, అతడి అనుచరులు దాడి చేశారని అన్నారు. ఈ ఘటనపై మనోహర్‌రెడ్డి నకిరేకల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదన్నారు. ఎస్పీ నకిరేకల్ నియోజకవర్గంపై దృష్టి పెట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌దే భవిష్యత్


అవగాహన కల్పిస్తున్న సుమన్‌కుమార్‌రెడ్డి


చిన్న రోబోలను తయారు చేస్తున్న విద్యార్థులు

సంస్థాన్ నారాయణపురం: భవిష్యత్‌లో రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కి అత్యంత ప్రాధాన్యత ఉంటుందిని ఏఐ థింకర్–ట్రెన్ బెంచ్ రోబోటిక్స్ సంస్థ సీఈఓ కొట్టం సుమన్‌కుమార్‌రెడ్డి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో శనివారం సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో చిన్న చిన్న రోబోలు తయారీ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి, శాస్త్ర సాంకేతిక రంగంలో రాణించేలా చూడటమే తమ సంస్థ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్. హనుమంత్, సంస్థ ప్రతినిధులు కొత్తపల్లి శ్రీనాథ్, అశ్విత్‌రాజ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్


సరైన పత్రాలు లేని వాహనాలను పట్టుకున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది

కోదాడరూరల్: నేరాలను నియంత్రించేందుకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి కోదాడ పట్టణ పరిధిలోని సాలార్జంగ్‌పేట్‌లో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇళ్లు, షాపులను తనిఖీ చేశారు. సరైన పత్రాలు చూపించని 34 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శివశంకర్, ఎస్‌ఐలు సుధీర్‌కుమార్, హనుమా నాయక్, 30మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తొలగింపు

- హాస్టల్ విద్యార్థి ఆత్మహత్య ఘటనలో ఉన్నతాధికారుల చర్యలు
- మరో ఇద్దరు టీచర్లకు చార్జి మెమోలు జారీ
- వాచ్‌ఉమెన్ సస్పెన్షన్

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలోని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాలలో 5వ తరగతి విద్యార్థిని ఊరబావి సంధ్య ఈ నెల 14న పాఠశాల బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ప్రిన్సిపాల్‌తో పాటు ఇద్దరు టీచర్లు, వాచ్‌ఉమెన్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఘటన జరిగిన వెంటనే బీసీ వెల్ఫేర్ సొసైటీ జాయింట్ సెక్రటరీ శ్యాంప్రసాద్‌తో పాటు యాదాద్రి జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, ఏసీపీ పటోళ్ల మధుసూదన్ రెడ్డి గురుకుల పాఠశాల హాస్టల్‌కు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపించారు. ఈ విషయాన్ని బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు దృష్టికి అధికారులతో పాటు విద్యార్థి, సామాజిక సంఘాల నాయకులు తీసుకెళ్లారు. దీంతో ప్రిన్సిపాల్ అల్లాని జ్యోతిని విధుల నుంచి తొలగించడంతో పాటు ఘటన జరిగిన రోజు విధుల్లో ఉన్న టీచర్లు ప్రత్యూష, షాహినాకు అధికారులు చార్జి మెమోలు జారీ చేశారు. వాచ్‌ఉమెన్‌గా పనిచేస్తున్న సవితను సస్పెండ్ చేశారు.

రేషన్‌కార్డుదారులకు 30శాతం రాయితీతో సరుకులు


మఠంపల్లిలో ఎస్‌వీఈ క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న సంస్థ ఇన్‌చార్జి సుధాకర్

మఠంపల్లి: రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు 30శాతం రాయితీతో సరుకులు అందించేందుకు ఎస్‌వీఈ కార్డులను అందుబాటులోకి తెచ్చినట్లు శ్రీవేంకటేశ్వర ఈకో ఫ్రెష్‌ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఇన్‌చార్జి సుధాకర్ తెలిపారు. శనివారం మఠంపల్లి మండల కేంద్రంలో ఎస్‌వీఈ క్యాంటీన్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న తమ సంస్థ క్యాంటీన్‌లో రేషన్ కార్డుదారులకు వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, నిత్యావసర సరుకులు, ఆర్గానిక్ కూరగాయలు రాయితీతో అందజేయనున్నట్లు వివరించారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సీఈఓ అనిల్‌కుమార్, డైరెక్టర్ సరిత, ఈఓలు మరియమ్మ, నాగేంద్రమ్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో పోస్టుమార్టంపై వర్క్‌షాప్

బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో శనివారం పోస్టుమార్టం నిర్వహణపై వైద్యులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ట్రాసౌండ్ ద్వారా నిర్వహించే ఊపిరితిత్తులు, ఉదర మూల్యంకనం నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పోస్టుమార్టం చేసే విధానాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ డీన్ నితిన్ జాన్, మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ అరోరా, రేడియాలజిస్టులు, అనస్థీషియాలజిస్టులు, క్రిటికల్ కేర్ నిపుణులు పాల్గొన్నారు.

సాక్షులను బెదిరించిన వ్యక్తులకు రిమాండ్

హుజూర్‌నగర్ (చింతలపాలెం): సాక్షులను బెదిరించిన వ్యక్తులను శనివారం చింతలపాలెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలం రేబల్లె గ్రామానికి చెందిన కొమ్మరబోయిన పవన్‌పై గతంలో పోక్సో కేసు నమోదైంది. పవన్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులు కొమ్మరబోయిన రాజు, కొమ్మరబోయిన సాయి కలిసి సాక్ష్యాలు చెప్పొద్దని ఫిర్యాదారుడు, సాక్షులను బెదిరించారు. దీంతో పోలీసులు వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులు ఎవరైనా సాక్షులను, ఫిర్యాదుదారులను బెదిరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

బారులుదీరిన వాహనాలు

బీబీనగర్: హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో బోనాల పండుగ సందర్భంగా రెండు రోజుల పాటు సెలవులు రావడంతో యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. దీంతో బీబీనగర్ మండల పరిధిలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద శనివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వెళ్లే మార్గంలో వాహనాలు బారులుదీరడంతో రద్దీ నెలకొంది.



పార్టీ బలోపేతానికి స్థానిక సంస్థల ఎన్నికలే కీలకం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

సూర్యాపేట : గ్రామస్థాయిలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి స్థానిక సంస్థల ఎన్నికలు కీలకమని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతీ ఓటును గెలవాలంటే కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి పార్టీ విధానాలు, అభివృద్ధిని వివరించాలని ఎమ్మెల్సీ సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా వారి మద్దతు పొందవచ్చన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా ప్రభారి గోలి మధుసూదన్ రెడ్డి, హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, జిల్లా కన్వీనర్ కడియం రామచంద్రయ్య, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన


భరతనాట్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు


భక్తి గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలోని తూర్పు మాడ వీధిలో శనివారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన గౌతమీ నృత్యాలయ కళాకారులు నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అంతకుముందు నల్లగొండకు చెందిన శృతిలయ ఆర్గనైజేషన్ అకాడమీ ఆధ్వర్యంలో చేపట్టిన భక్తి సంగీతం అబ్బురపరిచింది.